04052024-DIS-04_Layout 1 5/4/2024 4:27 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

తిట్ల సీఎంగానే మిగిలిపోతాడా?

బుద్ధా మురళి

దేశ ప్రధాని మొదలుకొని గ్రామ సర్పంచ్ వరకు తన ముద్ర ఉండాలని కోరుకుంటారు. ఇప్పటివరకు ఈ దేశాన్ని పాలించినవారు, రాష్ట్రాన్ని పాలించినవారు ఎక్కువ మంది దేశంపై, రాష్ట్రంపై తమదైన ముద్ర ఒకటి బలంగా వేశారు. ఆధునిక భారత దేశంపై జవహర్‌లాల్ నెహ్రూ వేసిన బలమైన ముద్ర చెరిగిపోనిది. ఆయన మరణించిన 60 ఏండ్ల తర్వాత, ఇప్పుడు కూడా నెహ్రూ ముద్రను చెరిపివేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంటే ఈ దేశంపై నెహ్రూ వేసిన ముద్ర ఎంత బలమైనదో అర్థం చేసుకోవచ్చు.

బ్రిటిష్ పాలకుల దరిద్రం వదిలిందనుకున్న దేశాన్ని ఆధునిక భారతదేశంగా మార్చడానికి జవహర్‌లాల్ నెహ్రూ వేసిన బలమైన పునాదులు ఇప్పటి పాలకులను ఇంకా భయపెడుతున్నాయి. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ఒక సభలో మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో ఒకచోట నెహ్రూ పటం ఉండేది. తాను ప్రధానమంత్రి అయ్యాక ఒకరోజు చూస్తే ఆ పటం లేదు. ఇక్కడ నెహ్రూ పటం ఉండేది, ఏమయ్యిందని అధికారులను అడిగితే, తీసేశామని చెప్పారు. వెంటనే ఆ పటాన్ని అక్కడ మళ్లీ పెట్టండని వాజపేయి ఆదేశించారు. మేరు పర్వతం లాంటి నాయకుల మనస్తత్వం అలా ఉంటుంది. మరుగుజ్జు మనస్తత్వం ఉన్నవారు పేరు చెరిపేయడం ద్వారా తమ ముద్ర వేయాలనుకుంటారు. దేశంలో కాంగ్రెస్ ఓటమిలో, ఢిల్లీలో కాంగ్రెస్‌కు అడ్రస్ లేకుండా చేయడంలో ఆప్ పార్టీ పాత్ర పెద్దదే. జవహర్‌లాల్ నెహ్రూ ముందుచూపుతో ఐఐటీలను ఏర్పాటుచేయకపోయి ఉంటే తాను ఎక్కడో పకోడీలు అమ్ముకొంటూ ఉండేవాడినని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు.

కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే తెలంగాణ ఎలా ఉండాలని పంచాయతీరాజ్ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి అక్కడ తొలిసారిగా మాట్లాడింది నెహ్రూ గురించే. అమెరికాలో పనిచేస్తున్న అధికారిని ఇండియాకు రప్పించి నెహ్రూ పంచాయతీరాజ్ వ్యవస్థను ఎలా బలోపేతం చేశారో వివరించారు. ఈ దేశంలో ప్రజలు, వివిధ పార్టీల నాయకులు నెహ్రూను ఒక పార్టీ నాయకుడిగా చూడరు. ఆధునిక భారత నిర్మాతగా చూస్తారు. హ్రస్వ దృష్టి గలవారు మాత్రమే మేరు పర్వతం లాంటి నాయకత్వాన్ని చూసి సహించలేరు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నెహ్రూ ముద్రను చెరిపివేయడానికి దేశ ప్రధాని ప్రయత్నిస్తుంటే రాష్ట్రంలో కేసీఆర్ ముద్రను చెరిపివేస్తానని అసెంబ్లీ సమావేశాల్లోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 2014లోనే ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని కంగనా రనౌత్ లాంటి వారు గట్టిగా నమ్మినట్టే గత పాలకుల ముద్రలను చెరిపివేయగలమనుకునే నాయకులు, వారి మాటలు నమ్మేవారుంటారు. కానీ, అది సాధ్యం కాదు. భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఐఐటీలు, ప్రభుత్వరంగ సంస్థలు వీటిలో నెహ్రూ ముద్ర ఎప్పుడూ ఉంటుంది. మన రాష్ట్రానికి వస్తే కేసీఆర్ నాయకత్వంలో జరిగిన ఉద్యమం వల్ల తెలంగాణ సాకారమైంది. తెలంగాణ ఉన్నంత వరకు ఈ ముద్ర ఉంటుంది. మహా టీవీలో ఐ.వెంకట్రావు జరిపిన ఇంటర్వ్యూలో గతంలో స్వయంగా రేవంత్‌రెడ్డే ఈ విషయం చెప్పారు. వేరే పార్టీ కాబట్టి మేం ఒప్పుకోవద్దు కానీ, కేసీఆర్ మొండి పట్టుదలతోనే తెలంగాణ సాధ్యమైందని చెప్పారు. ఇప్పుడు కేసీఆర్ ఉద్యమం వల్ల కాదు చంద్రబాబు, తాను జరిపిన ఉద్యమం వల్ల తెలంగాణ వచ్చిందని చెప్తున్నారు. చెప్పేవారికి మొహమాటం లేకపోవచ్చు కానీ, నమ్మేవారు ఎవరు?

ఒక రాజకీయ పార్టీ గెలుపోటములకు అనేక కారణాలుంటాయి. కానీ, అధికారంలోకి వచ్చినవారు పాలనలో తమదైన ముద్ర వేయడానికి ప్రయత్నించాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలే అవుతున్నది. ఇంకా నాలుగున్నరేండ్ల సమయం ఉన్నది. ఆరు నెలలకే అంతా అయిపోయిందని చెప్పడం సరికాదు. అదే సమయంలో కాళ్లు కడిగినప్పుడే కాపురం చేసే తీరు తెలుస్తుందన్నట్టు రేవంత్‌రెడ్డి మొదటినుంచీ తిట్లనే తనదైన ముద్రగా చూపుతున్నారు. టీడీపీ అధ్యక్షునిగా ఉన్నప్పటి నుంచే తాను ఏదో ఒకరోజు ముఖ్యమంత్రిని అవుతానని రేవంత్‌రెడ్డి చెప్పేవారు. చదువుకునే రోజులనుంచే రేవంత్‌రెడ్డి ఈ మాట చెప్పేవారని కొందరు చెప్పున్నారు. కానీ, టీడీపీ అధ్యక్షునిగా ఉన్నప్పటి నుంచి నేను విన్నాను. సీఎంను అవుతానని చెప్పేవారు కానీ, మీడియాతో మాట్లాడినప్పుడు కానీ, ఇష్టాగోష్టి చర్చల్లో కానీ ఎప్పుడూ తెలంగాణ ఇలా ఉండాలని, నేను సీఎం అయితే ఇలా చేస్తానని కానీ ఎప్పుడూ చెప్పలేదు. తన లక్ష్యం సీఎం కావడం, అది ఎప్పుడూ దాచుకోలేదు పైకే చెప్పారు. కాలం కలిసి వచ్చి సీఎం అయ్యారు. ప్రతి సభలో, ప్రతిరోజు తిట్లనే తన ముద్రగా చూపుతున్నారు.

ఇందిరా గాంధీ అంటే 'గరీబీ హటావో' అని గుర్తుకువస్తుంది. ఎన్టీఆర్ అంటే రూ.2కే కిలో బియ్యం గుర్తుకువస్తుంది. ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్ అంటే వైఎస్సార్ పేరు గుర్తుకువస్తుంది. తెలంగాణ అంటేనే కేసీఆర్ గుర్తుకువస్తారు. ఇంటింటికి తాగునీరు, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతుబీమా వంటి ఎన్నో వినూత్న పథకాలపై కేసీఆర్ తన ముద్ర వేశారు. ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇప్పటివరకు రేవంత్ రెడ్డి ముద్ర అంటూ బలంగా ఏమీ లేదు. అలాంటి ప్రయత్నాలు కూడా కనిపించడం లేదు.

టీఎస్‌ను టీజీగా మార్చడం, సీఎం నివాసాన్ని డిప్యూటీ సీఎం నివాసంగా మార్చడం అవేమీ ముద్రలనిపించుకోవు. డ్రాయర్లు లాగుతా, చెడ్డీలు లాగుతా, పేగులు మెడలో వేసుకుంటా అనే తిట్ల రూపంలోనే తన ముద్ర గుర్తుండిపోవాలని రేవంత్‌రెడ్డి కోరుకుంటున్నారా? టీడీపీ నాయకునిగా, పీసీసీ అధ్యక్షునిగా రేవంత్‌రెడ్డి తిట్ల ద్వారా రాజకీయంగా మంచి ప్రచారం పొంది ఉండవచ్చు, ప్రయోజనం కూడా పొంది ఉండవచ్చు. కానీ, సీఎంగా ఈ తిట్ల వ్యూహం ఎంతవరకు ఆయనకు ఉపయోగపడుతుందనేది కాలమే సమాధానం చెప్తుంది.

రాష్ట్రంపై తనదైన ముద్ర వేయడానికి రేవంత్‌రెడ్డికి ఒక అవకాశం దొరికింది, తనకు తిట్ల ముద్ర సరిపోతుందనుకుంటున్నారా? పాలనలో ప్రజలకు చిరకాలం గుర్తుండే ముద్ర వేయాలనుకుంటున్నారా అనేది ఆయనే తేల్చుకోవాలి.

ఎటమటం

సోషల్ మీడియా ఉంది జాగ్రత్త!

రేవంత్‌రెడ్డిని కూడా అరెస్టు చేస్తే ఓ పనైపోతదని సీపీఐ నేత నారాయణ కేంద్రానికి సలహా ఇచ్చారు. కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ ఇద్దరు సీఎంలను జైల్లో పెట్టిన కేంద్రం, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కూడా అరెస్టు చేస్తే ముగ్గురు సీఎంలను జైల్లో పెట్టినట్టు అవుతుందని ఆయన సూచించారు. ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీగా ఉన్న సీపీఐ నేత నారాయణ ఈ విధంగా మాట్లాడటం ఏమిటని ఆశ్చర్యపోతున్నారా? అవును నిజమే, అంతా సోషల్ మీడియా మాయ. కేంద్ర ప్రభుత్వాన్ని ఎండగట్టే క్రమంలో కాస్త వ్యంగ్యాన్ని జోడించి చేసిన వ్యాఖ్యలను ముందు వెనుకా కట్‌చేసి రేవంత్‌రెడ్డి అరెస్టుకు సీపీఐ నారాయణ డిమాండ్ చేసినట్టుగా సోషల్‌మీడియాలో వైరల్ అయింది. శృతిమించుతున్న సోషల్ మీడియా వైఖరి వల్ల భవిష్యత్‌లో సోషల్ మీడియా ఉంది జాగ్రత్త అని చట్టబద్ధమైన హెచ్చరిక చేసే రోజులు వచ్చినా ఆశ్చర్యం లేదు.

డివోషనల్ టూరిజమ్

సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కోసం రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న పర్యటన వల్ల కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు వస్తాయన్నది దేవుడికే తెలియాలి, కానీ ఏ దేవుడు ఎక్కడ ఉన్నది జనాలకు తెలియజేసేవిధంగా పరోక్షంగా డివోషనల్ టూరిజమ్ డెవలప్‌మెంట్‌కు ఆయన కృషిచేస్తున్నారని గాంధీభవన్‌లో ఓ సీనియర్ నాయకుడు కొత్త విషయం చెప్పారు. ఎన్నికల ప్రచార సభలకు సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడికెళ్తే, ఆ చుట్టుపక్కల ప్రాంతంలో ఉన్న దేవుళ్లపై ఒట్టేసి ఆగస్టు 15 కల్లా రుణ మాఫీ చేస్తామని హామీ ఇస్తున్నారు. దీనివల్ల కాంగ్రెస్ సీట్ల మాటేమో కానీ, డివోషనల్ టూరిజమ్ మాత్రం బాగా డెవలపయ్యే అవకాశం లేకపోలేదని సదరు నాయకుడు చెప్పుకొచ్చారు.

హమ్ కిసీ సే కమ్ నహీ!

ఏ మాటకామాట చెప్పుకోవాలంటే... కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి స్టయిలే వేరు. ఆయన గెలిచినా, ఓడినా షాన్ మే ఫరక్ రాకుండా జాగ్రత్త పడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార షెడ్యూల్‌ను పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కరికే పీసీసీ ఖరారు చేసింది. మంత్రులు కూడా తమను ఇంచార్జీలుగా నియమించిన నియోజకవర్గాల్లో అభ్యర్థులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. కానీ, జగ్గారెడ్డి అలా కాకుండా, తనకు తానే తెలంగాణ కాంగ్రెస్ కమిటీ పేరిట లెటర్‌హెడ్ ముద్రించుకొని ఎన్నికల ప్రచార షెడ్యూల్ ప్రకటించుకున్నారు. సొంతంగా ప్రచార రథం, సొంత ఖర్చుతో అభ్యర్థి లేకుండానే పార్టీ తరపున రోడ్ షో, కార్నర్ మీటింగ్, పబ్లిక్ మీటింగ్ కార్యక్రమాలను ఈ నెల 11 వరకు ఆయనే ప్రకటించుకున్నారు. ఇది చూసి నవాళ్లు జగ్గన్నా... మజాకా అంటున్నారు.

అందరూ మంత్రులే

రాష్ట్రంలో బీజేపీ తరపున పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులంతా తనను గెలిపిస్తే కేంద్ర మంత్రి అవుతానని ఎవరికివారు ప్రచారం చేసుకుంటున్నారు. గతంలో ఏపీ, తెలంగాణకు కలిపి కిషన్‌రెడ్డి ఒక్కరికే కేంద్ర మంత్రివర్గంలో స్థానం లభించింది. అలాంటిది ఈసారి ఎంతమందికి ఇస్తారని మీడియా వాళ్లు అడిగితే మాత్రం సమాధానం లేదు. ఏమో అవన్నీ తమకు తెలియదనీ.. గెలిస్తే కేంద్ర మంత్రి పదవి ఇస్తామని పార్టీ పెద్దలు చెప్పారని అంటున్నారు. ఇప్పటివరకు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, డీకే అరుణ, బండి సంజయ్, విశ్వేశ్వర్‌రెడ్డి, ధర్మపురి అరవింద్, మాధవీలత, రఘునందన్‌రావు మంత్రి పదవుల రేసులో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ లెక్కన రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులు తప్ప వట్టి ఎంపీలు ఎవరుండరన్న మాట!

- వెల్జాల

మోదీ.. గుజరాత్‌కే ప్రధాని!

వై.సతీష్ రెడ్డి
96414 66666

తెలంగాణ భారతదేశంలోనే ఉన్నది. రాష్ట్రం ఏర్పడి పదేండ్లు మాత్రమే అవుతోంది. కొత్త రాష్ట్రం, చిన్న రాష్ట్రమే అయినా దేశ ఆర్థికవ్యవస్థలో కీలకంగా ఉన్నది తెలంగాణ. దేశంలో సంపదను సృష్టిస్తున్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ముందువరుసలో ఉన్నది. అయితే ఏదైనా సరే ఇచ్చిపుచ్చుకోవడంలోనే సంతృప్తి, సంతోషం ఉంటాయి. కానీ, ఆ విషయంలో తెలంగాణకు తీవ్రమైన అన్యాయం జరుగుతున్నది. జరుగుతున్నదని అనడం కంటే ప్రధాని మోదీ పనిగట్టుకొని మరీ అన్యాయం చేస్తున్నారంటే బాగుంటుంది. నిలువెల్లా స్వార్థం, పక్షపాత ధోరణిని నింపుకొన్నారాయన.

ఎన్నికల ప్రచారం కోసం వచ్చి పచ్చి అబద్ధాలు చెప్పే మోదీ.. ఎందుకు తెలంగాణపై వివక్ష చూపుతున్నారు? ఒక తెలంగాణ బిడ్డగా అడుగుతున్నా.. తెలంగాణ చేసిన తప్పేంటి? ఎందుకు మాకు రావాల్సిన ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లిపోతున్నాయి? ఎందుకు మాకు రావాల్సిన నిధులు అహ్మదాబాద్‌కు తరలిపోతున్నాయి? ఒక్క తెలంగాణకే కాదు.. దక్షిణాది రాష్ట్రాలకు రావాల్సిన నిధులను ఎందుకు దారి మళ్లిస్తున్నారు? నిస్వార్థంగా పనిచేస్తానని ప్రమాణం చేసి పదవిలో కూర్చున్న మోదీ.. ఎంత స్వార్థపూరితంగా పనిచేస్తున్నారో కొన్ని ప్రత్యక్ష ఉదాహరణలు ఇప్పుడు చూద్దాం.

నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక 2022లో రెండోసారి గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా ఆ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.60 వేల కోట్ల నిధుల వరద పారించింది. పాత లెక్కలను ఒకసారి పరిశీలిస్తే.. 2017-21 వరకు కేవలం నాలుగేండ్లలో గుజరాత్‌కు రూ.6 లక్షల కోట్ల కేంద్ర పెట్టుబడులు వెళ్లాయి. ఇది జాతీయ పెట్టుబడుల సగటులో 25.8 శాతం. వందలో రూ.25 గుజరాత్‌కే తీసుకుపోతే మిగతా 28 రాష్ట్రాల పరిస్థితి ఏమిటి? అభివృద్ధి అంటే సమగ్రంగా, సమ్మిళితంగా ఉండాలి. అప్పుడే అన్ని రాష్ట్రాలు సమానంగా అభివృద్ధి చెందుతాయి. పేదరికం దూరమవుతుంది. కానీ, నిధులన్నీ గుజరాత్‌కే ఇవ్వాలి, కాంట్రాక్టులన్నీ తన ఇద్దరు గుజరాతీ మిత్రులకే ఇవ్వాలనేది నరేంద్ర మోదీ విధానం అని ఎప్పటినుంచో ఆరోపణలున్నాయి.

నోటికాడి బుక్కను లాక్కుంటున్న మోదీ: గుజరాత్ కోసం ఇతర రాష్ట్రాల నోటికాడి బుక్కను లాగేసుకుంటున్నారు మోదీ. ఇతర రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు వచ్చి, అక్కడే పెట్టాలని నిర్ణయించిన ప్రాజెక్టులను సైతం గుజరాత్‌కు మళ్లించుకుంటున్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి సంప్రదాయ వైద్య కేంద్రం (గ్లోబల్ సెంటర్ ఫర్ ట్రెడిషనల్ మెడిసిన్)ను హైదరాబాద్‌లో ఏర్పాటుచేయాలని మొదట నిర్ణయించారు. కానీ, ఆ తర్వాత దీన్ని గుజరాత్‌లోని జామ్‌నగర్‌కు తరలించారు. 2022 ఏప్రిల్ 19న ప్రధాని మోదీ దీనికి శంకుస్థాపన చేశారు. మనదగ్గరే ఏర్పాటై ఉంటే రూ.2 వేల కోట్ల పెట్టుబడులు వచ్చి ఉండేవి. దేశంలోనే మొదటి రైల్వే లోకోమోటివ్ తయారీ యూనిట్ లెక్క ప్రకారమైతే మన రాష్ట్రంలోని కాజీపేటలో ఏర్పాటవ్వాలి. ఏపీ విభజన చట్టంలోనూ ఈ హామీ ఉన్నది. కానీ, మోదీ తన గుజరాత్ కోసం మన కోచ్ ఫ్యాక్టరీని లాక్కెళ్లిపోయారు. గుజరాత్‌లోని దాహోద్‌లో ఏర్పాటు చేసుకున్నారు. దేశంలోనే మొదటి అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం (ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్) కేసీఆర్ చొరవతో హైదరాబాద్‌లో ఏర్పాటైంది. ఇది చూసి మోదీకి కన్నుకుట్టింది. ఆ వెంటనే దీనికి పోటీగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉన్న గిఫ్ట్ సిటీలో మారిటైమ్ ఆర్బిట్రేషన్ సెంటర్ పేరుతో మరో దాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. 2022-23 బడ్జెట్‌లో దానికి నిధులు కూడా కేటాయించారు.

దేశంలోనే మొట్టమొదటి సెమీ కండక్టర్ ప్లాంట్‌ను పుణెలోని తళేగావ్‌లో పెట్టాలని మొదట నిర్ణయించారు. కానీ, దీన్ని గుజరాత్‌లోని ధొలేరాకు పట్టుకుపోయారు. ప్లాంట్ ఏర్పాటు కోసం అనుకూల ప్రాంతాలపై సర్వే చేసిన నిపుణులు ధొలేరా కంటే తళేగావ్ అయితేనే బాగుంటుందని చెప్పినా.. దాన్ని మోదీ సర్కారు బుట్టదాఖలు చేసింది. తళేగావ్‌లోనే ఏర్పాటుచేసి ఉంటే మహారాష్ట్రకు రూ.1,54,000 కోట్ల పెట్టుబడులు వచ్చేవి.

మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వమే ఉన్నా.. గుజరాత్‌పై మోదీకి ఉన్న ప్రేమ కోసం దాన్ని త్యాగం చేయక తప్పలేదు. రూ.22 వేల కోట్ల వ్యయంతో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో పెట్టాల్సిన విమాన తయారీ కేంద్రాన్ని గుజరాత్‌లోని వడోదరకు షిఫ్ట్ చేశారు. భారతదేశపు మొదటి అంతర్జాతీయ ఆర్థిక సేవా కేంద్రాన్ని తన సొంత రాష్ట్రంలోనే ఏర్పాటు చేసుకున్నారు.

అన్నీ గుజరాత్‌కే...: దేశంలోనే మొట్టమొదటి బుల్లెట్ రైలు ప్రాజెక్టును నరేంద్రమోదీ సర్కారు 2017లో ప్రకటించింది. దీని ప్రారంభ స్థానం అహ్మదాబాద్. ఈ బుల్లెట్ రైలు ఎక్కువ దూరం ప్రయాణించేది కూడా గుజరాత్‌లోనే. ఈ ప్రాజెక్టు దూరం మొత్తం 508 కిలోమీటర్లు కాగా.. ఇందులో 348 కిలోమీటర్ల విస్తీర్ణం గుజరాత్‌లోనే ఉంది. ఇదీ మోదీ దేశభక్తికి, దేశం మీద, దేశంలోని ఇతర రాష్ట్రాల మీద ఉన్న ప్రేమకు మరో మచ్చుతునక. ఆయన పక్షపాత ధోరణి ఇక్కడితో ముగిసిపోలేదు. దేశంలోనే మొట్టమొదటి బల్క్ డ్రగ్ పార్క్‌ను తన రాష్ట్రానికే పట్టుకుపోయారు. దేశంలోని మొదటి మెడికల్ డివైజ్ పార్క్‌ను గాంధీనగర్‌లోనే పెట్టుకున్నారు. భారతదేశంలోనే అతిపెద్ద ఒలింపిక్ స్థాయి స్పోర్ట్స్ కాంప్లెక్స్ కూడా గుజరాత్‌లోనే ఏర్పాటు చేశారు. దేశంలో మొట్టమొదటగా ఎయిర్‌పోర్టు స్థాయిలో ఓ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయగా.. అది కూడా గుజరాత్‌కు చెందినదే. అంతరిక్షంపై ఆసక్తిని పెంచే లక్ష్యంతో భారీ టెలిస్కోపు ఏర్పాటుచేయాలని నిర్ణయిస్తే.. దాన్ని కూడా మోదీ సొంత ఊరైన వాడ్‌నగర్ దగ్గరలో నిర్మించుకున్నారు. దేశంలో మొట్టమొదటి రైల్వే నేషనల్ యూనివర్సిటీ దాదాపు రూ.865 కోట్లతో గుజరాత్‌లోని వడోదరలో ఏర్పాటు చేశారు. హై స్పీడ్ రైల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (హెచ్ఎస్ఆర్‌టీఐ) కూడా ఇదే క్యాంపస్‌లో పెట్టారు. చివరికి గుజరాత్‌లోని మొతేరాలో అతిపెద్ద స్టేడియాన్ని నిర్మించి దానికి ఏకంగా తన పేరునే పెట్టుకున్నారు. 2023 ఐసీసీ వరల్డ్ కప్ కీలక మ్యాచ్‌లు ఇక్కడే జరిగాయి. వరల్డ్‌కప్ ప్రారంభ మ్యాచ్, అత్యంత కీలకమైన ఇండియా-పాకిస్థాన్ మ్యాచ్, అలాగే ఫైనల్ మ్యాచ్ కూడా ఇదే స్టేడియంలో నిర్వహించి.. మరోసారి తన స్వార్థబుద్ధిని బయటపెట్టుకున్నారు. 2022, 2023 ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లు కూడా గుజరాత్‌లోనే నిర్వహించారు. చివరికి.. అమెరికా అధ్యక్ష హోదాలో డొనాల్డ్ ట్రంప్ దేశానికి వస్తే.. మురికివాడలకు అడ్డుగా గోడలు, పరదాలు కట్టి మరీ గుజరాత్ ఇమేజ్ పెంచుకోవడానికి ఆయన్ను అక్కడికి తీసుకుపోయారు.

ఇతర రాష్ట్రాలపై మోదీ వివక్ష ఎలా ఉంటుందనే దానికి మరో ఉదాహరణ ఇప్పుడు చూద్దాం. తెలంగాణతో సహా దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ నాయకులు.. ఎక్కడికి వెళ్లినా ఊర్ల పేర్లు మారుస్తామని చెప్తుంటారు. ఇస్లాం మతస్థుల పేర్లతో ఉన్నాయని ఢిల్లీలో కొన్ని వీధుల పేర్లు మార్చారు. యూపీలోని కీలక పట్టణమైన అలహాబాద్ పేరును ప్రయాగ్‌రాజ్‌గా మార్చారు. అటు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ పేరును మార్చారు. కానీ, గుజరాత్ రాజధాని పేరు అహ్మదాబాద్. ఇప్పటికీ దాని పేరు అలాగే ఉన్నది. అలాగే అదే అహ్మదాబాద్ దగ్గరలో గిఫ్ట్ సిటీ పేరుతో ఓ పట్టణాన్ని నిర్మించారు. ఇతర రాష్ట్రాల్లో మాత్రం పేర్లు మార్చేస్తారు. గుజరాత్‌లో మాత్రం అన్నీ యథావిధిగా ఉంటాయి.

ఇలా చెప్పుకుంటూ పోతే.. మోదీ స్వార్థ రాజకీయాలకు బలైన రాష్ట్రాలు, రూటు మార్చుకుని గుజరాత్ గూటికి చేరిన నిధుల కహానీలు కోకొల్లలు. స్వరాష్ట్రంపై ప్రేమ తప్పు కాదు. కానీ, ఇతర రాష్ట్రాల కడుపుకొట్టి ఒక్క రాష్ట్రానికి దోచిపెట్టడమే క్షమించరాని నేరం. నరేంద్ర మోదీ, ఆయన సహచరుడు అమిత్ షా అదే నేరం పదే పదే చేస్తున్నారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' అన్న నినాదాన్ని.. 'గుజరాత్ కా సాత్.. గుజరాత్ కా వికాస్' అన్నట్టుగా మార్చేశారు. నిధులు, పెట్టుబడులు.. ఏవైనా సరే తమ సొంత రాష్ట్రానికి తరలించుకుపోవాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నారు. అందుకే ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో దేశ ప్రజలు వీరిని ఇంటికి పంపడం పక్కా. అప్పుడు సొంత రాష్ట్రంలో తప్ప మరోచోట తల దాచుకోలేరు. అందుకే ఇప్పుడే అన్నీ అక్కడికి తరలిస్తే రేపటి రోజున అక్కడైనా తమకు నాలుగు నూకలు దొరుకుతాయనే స్వార్థం వాళ్లది. దానికోసం ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపైనా కక్ష సాధిస్తున్నారు. బీజేపీ అధికారంలో ఉన్న తమ రాష్ట్రాల హక్కులను సైతం కాలరాస్తున్నారు. కాబట్టి యువత, ప్రజలు ఇప్పటికైనా ఆలోచించాలి.

(వ్యాసకర్త: మాజీ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ)

నల్ల చట్టాల నిరసన

నా దేశంలో నేను
నన్ను నేను కాపాడుకునే
స్థితికి వచ్చాను
నాగలి పట్టే చేతులతో
నల్ల జెండాలు పట్టించారు

ఇదేనా నా దేశ దుస్థితి
నల్ల చట్టాల రద్దు కొరకు
నా దేశం నడిరోడ్లపై నిరసనలు
ఇదేనా దేశ ప్రగతి

నా స్వాతంత్ర్య దేశంలో
నల్లజాతిపై నన్ను నేను
కాపాడుకునే రక్షణ నిరసన

అన్నం పెట్టే రైతునే
ఆగం పట్టిస్తే
ఆఖరికి మిగిలేది
బతుకు శూన్యమే

ఆకలి తీర్చే
అన్నపూర్ణమ్మను
అణచ చూస్తే
ప్రపంచంలో మిగిలేది శూన్యం

రైతు రాశులు పోసిన
ధాన్యాన్ని రాల్చకుంటే
ప్రపంచానికి పట్టెడన్నం
పెట్టే శక్తి ఎవడికుంది
ఎవడు పెట్టగలడు

నేను దున్నే సత్తువ
మట్టిలో పొర్లే గుణం
ఇత్తును నాటే బలం
ఏ రాజుకు ఉంది

అంతరిక్షంలో
చంద్ర మండలం చేరినా
రైతు బురద నుంచి
బువ్వ తియ్యకుంటే
చంద్ర మండలం చేరే శక్తి ఎవరిది

సృష్టి తర్వాత జీవం నిలవడానికి
ప్రత్యామ్నాయంగా

ప్రపంచాన్ని గడగడలాడించిన
అలెగ్జాండర్ అయినా
ఆస్తి లేకుండా ఒట్టి చేతులతో
ఒరిగిపోయాడు నేలకు

రైతు లేని రాజ్యముల
దేవుడున్న దేశముల
ఏమి చూడగలము
అంధకార మగుబడును

దేవుడు లేని దేశముల
రైతున్న రాజ్యముల
ఏమి చూడగలము
వెలుగు చూడగలము

కిసాన్‌ను కించపరిచి
గుళ్లకు పెట్టే వ్యయం
రైతులకు రాసి పోస్తే
రాదు దేశాన కరువు

నల్ల చట్టాల పోరు
రాదనుకున్న దేశాన
రానే వచ్చింది రైతుల నిరసన

దేవరపాగ కృష్ణయ్య
99634 49579



రాముడు చూపిన మార్గం సంగతేంటి?

మేం మా కెరీర్లను పణంగా పెట్టి రోడ్లెక్కి ఎండనక, వాననక పోరాటం చేశాం. కానీ, ఇప్పటికీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయలేదు. అరెస్టు సంగతేమో కానీ, ఇప్పుడు ఆయన కొడుకుకు టికెట్ ఇచ్చి దేశంలోని కోట్లాది మంది ఆడబిడ్డల మనోధైర్యాన్ని దెబ్బ తీశారు. రాముడి పేరు మీద ఓట్లు కావాలి, మరి ఆయన చూపిన మార్గం సంగతేంటి?

- సాక్షిమాలిక్, రెజ్లర్